రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తాం

తాసీల్దార్ల సమావేశంలో : మంత్రి పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి పటిష్ట విధానాన్ని రూపొందిస్తున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ వ్యవస్థ పనితీరుపై తాసీల్దార్లు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. 33 జిల్లాల తాసీల్దార్లతో షామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో ఆదివారం ముఖాముఖి కార్యక్రమం ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో రెవెన్యూ యంత్రాంగం పనితీరు మరింత మెరుగుపడాలని, ఒక్క అంగుళం ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాసీల్దార్లపై కేసులు నమోదు చేయాలంటే ఇకపై ముందస్తుగా కలెక్టర్ల అనుమతి తీసుకోవాలని, ఆ దిశగా డీజీపీతో చర్చించి త్వరలోనే ఆదేశాలు జారీ చేస్తామని వెల్లడించారు. మౌలిక వసతుల కల్పన, బదిలీలు తదితర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్, మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టర్ గౌతమ్‌పాత్రు, తాసీల్దార్లు పాల్గొన్నారు.

నక్సల్ డంప్‌లో టీవీ!

ఛత్తీస్‌గఢ్‌లో పోలీసుల స్వాధీనం

సుక్మా: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో పోలీసులు ఆదివారం ఓ నక్సల్ డంప్ నుంచి టెలివిజన్ సెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ రేంజ్ పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ సుందర్ రాజ్ మాట్లాడుతూ, దంతేష్ పురం సమీపంలోని అడవుల్లో భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇక్కడ ఉన్న డంప్‌లో బీపీఎల్ టీవీ సెట్ దొరికినట్లు చెప్పారు. టీవీ దొరకడం ఇదే మొదటిసారి అని చెప్పారు. ఈ డంప్ నుంచి మజిల్ లోడింగ్ గన్, టిఫిన్ బాక్స్ బాంబ్, ప్రెజర్ ఐఈడీ స్విచ్, 49 సిరంజ్‌లు, మొబైల్ చార్జర్లు, మావోయిస్టు బ్యానర్లు, సాహిత్యం, మందులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సర్కారు మాఫీ.. సర్వం మాయ!

- క్రాప్‌లోన్ ఫ్యామిలీ గ్రూపింగ్ పూర్తి
- 4.25 లక్షల కుటుంబాల ఎదురుచూపులు
- ఇంకా మిగిలిన 30 రకాల సాంకేతిక సమస్యలు
- 2 లక్షలపైన రుణాలపై తేల్చని ప్రభుత్వం
- వ్యవసాయ పంటరుణాలపై వీడని నీలినీడలు

జగిత్యాల జిల్లా మల్యాలలో రుణమాఫీ కాని రైతుల నుంచి ధ్రువీకరణ పత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

కరీంనగర్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆగస్టులోపే అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింపజేస్తామని ఊదరగొట్టిన రేవంత్ సర్కారు..మూడు విడుతల్లో 45 నుంచి 55 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసింది. మిగిలిన రైతులు పోరుబాట పట్టడంతో క్రాప్‌లోన్ ఫ్యామిలీ గ్రూపింగ్‌కు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో 4.25 లక్షల మంది రైతు కుటుంబాల గ్రూపింగ్ పూర్తి చేసిన అధికారులు ఆ వివరాలను ప్రభుత్వానికి అప్‌లోడ్ చేశారు. గ్రూపింగ్ పూర్తయినా వీరికి మాఫీ ఎప్పుడు చేస్తారో ప్రభుత్వం స్పష్టతనివ్వడం లేదు. మరో 30 రకాల సాంకేతిక సమస్యలతో నిలిచిపోయిన రుణమాఫీకి సర్వే ఎప్పుడు చేయాలన్న అంశంపై ఇంకా ఆదేశాలు రాలేదు. రూ.2 లక్షలపైగా రుణం తీసుకున్నవారికి మాఫీ ఎలా చేయాలో అధికారులకు, బ్యాంకర్లకు నేటికీ స్పష్టతనివ్వలేదు. దీంతో రైతులు అధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్కారు రోజుకో కొత్త విషయాన్ని తెరపైకి తెస్తూ .. రుణమాఫీ అంశాన్ని పూర్తిగా డైవర్ట్ చేస్తున్నదని విమర్శలు వస్తున్నాయి.

4.25 లక్షల కుటుంబాల గ్రూపింగ్

రూ.2 లక్షల వరకు పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీకి మొత్తం 22,37,848 ఖాతాల్లోకి రూ.17,933.19 కోట్ల నిధులను విడుదల చేసినట్టుగా ఆగస్టు 17న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తయినట్టుగానే మంత్రి చెప్పడంతో రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ వర్తించని రైతులు భగ్గుమన్నారు. ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలతో సర్కారు దిగొచ్చింది. రుణమాఫీకాని రైతుల ఇండ్ల వద్దకు నేరుగా వ్యవసాయ అధికారులు వచ్చి వివరాలు సేకరిస్తారని ప్రకటించింది. అంతలోనే మాట మార్చి రేషన్‌కార్డు సమస్యలతో రుణమాఫీకాని రైతులను సర్వే చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య 4.25లక్షల కుటుంబాల్లో ఉన్నదని పేర్కొన్నది. జిల్లాల వారీగా వ్యవసాయ అధికారులు రైతు కుటుంబాలను రైతు వేదికల వద్దకు పిలిపించి ప్రత్యేక యాప్‌లో క్రాప్‌లోన్ ఫ్యామిలీ గ్రూపింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. 4.25 లక్షల కుటుంబాల గ్రూపింగ్ పూర్తయింది కాబట్టి.. సదరు రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలి. కానీ, ప్రభుత్వం ఈ విషయంపై ఇంతవరకు స్పష్టత ఇవ్వలేదు.

మిగిలిన వాటిపైనా అస్పష్టత

ఆధార్‌లో అచ్చుతప్పులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు లేక ఇబ్బందులు, ఆధార్‌కు, పట్టాదారు పాసుపుస్తకానికి అలాగే బ్యాంకులో ఉన్న ఖాతానంబర్, ఆధార్ నంబర్ మధ్య తేడా, ఇన్‌వాలిడ్ ఆధార్ నంబర్, నో డేటా ఫౌండ్, ఆధార్, రుణఖాతాల్లో వేర్వేరుగా ఉంటే ఆధార్ అప్‌లోడ్ చేయడం, ఆధార్ ఫ్యామిలీ గ్రూపింగ్ లేకపోవడం, పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోవడం, ఆధార్‌తో బ్యాంకు లింకేజీ లేకపోవడం వంటి సాంకేతిక సమస్యలను సాకుగా చూపి ప్రభుత్వం రుణమాఫీ వర్తింపజేయలేదు. ఈ విషయాన్ని గుర్తించిన వ్యవసాయ శాఖ గతంలోనే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ పరిస్థితుల్లో రేషన్‌కార్డు సంబంధిత సమస్యలపై గ్రూపింగ్ పూర్తి చేసిన సర్కారు.. మిగిలిన సమస్యలతో రుణమాఫీ పొందని వారికి సంబంధించి ఎప్పటి నుంచి వివరాలు సేకరిస్తుంది..? ఏ ఫార్మెట్‌లో చేస్తుందన్న దానిపై స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో సదరు రైతుల్లో అయోమయం నెలకొంది. అసలు.. మాఫీ చేస్తారా? చేయరా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

మీనమేషాలెందుకు?

రుణమాఫీకి కట్టుబడి ఉన్నట్టుగా చెపుతున్న సర్కారు.. 31 అంశాలతో రుణమాఫీ కాని రైతుల వివరాలను ఒకేసారి సేకరించి.. అందులో అర్హులను నిర్ధారిస్తే సరిపోయేది. కానీ, ప్రభుత్వం దీనిని సాగదీస్తున్నది. ఆగస్టులోపు రూ.2 లక్షల పంట రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేస్తామని చెప్పిన సర్కారు... సర్వేలు, వివరాల సేకరణ పేరుతో కాలం దాటవేసే ప్రయత్నం చేస్తున్నది. ఒక్కో అంశం వారీగా సర్వేలు చేస్తే.. మరో ఏడాది పట్టినా.. రుణమాఫీ ప్రక్రియ పూర్తికాదన్న అభిప్రాయాలను అధికారులే వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి రుణమాఫీ చేయాలన్న లక్ష్యం ఉంటే.. వ్యవసాయశాఖాధికారులకు తోడు రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖలను అనుసంధానం చేసి.. వారం పది రోజుల్లో రుణమాఫీ కాని రైతుల పూర్తి వివరాలను సేకరించవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న దాటవేత, నాన్చివేత ధోరణి వల్ల లక్షలాది మంది రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

నెలదాటినా మాఫీ కాలె

రామన్నపేట గ్రామీణ బ్యాంకులో లక్షన్నర రుణం తీసుకున్న. రేషన్ కార్డులేదని రుణమాఫీ కాలేదన్నరు. ఆగస్టు 29న ఫొటోలు దిగి.. పత్రాలపై సంతకాలు చేసి ఇచ్చినం. నెలరోజులైనా ఏ స్పందన లేదు.

-ముస్కు గంగారెడ్డి, రైతు రాంపూర్, జగిత్యాల జిల్లా

మాకేమీ తెలియదంటున్నరు

నాకు, నా భార్య రమకు కలిపి పంట రుణం 1.99 లక్షల రుణం ఉంది. రేషన్ కార్డులేని కారణంగా రుణమాఫీ వర్తించలేదన్నరు. కుటుంబ సభ్యులతో ఫొటో దిగి ధ్రువీకరణ పత్రం ఇచ్చాం. ఇప్పటి వరకు.. అడుగు ముందుకు పడలే, ఎవరిని అడిగినా తెలియదంటున్నరు.

-కొమ్ముల కమలాకర్‌రెడ్డి, ముత్యంపేట గ్రామం, జగిత్యాల జిల్లా

'సెల్ఫీ'లతోనే సరిపెట్టేస్తారా?

- దమ్మపేట మండలంలో 3,300 మందికి కాని రుణమాఫీ
- 2,800 మందికి ఫ్యామిలీ గ్రూపింగ్.. 500 మంది పెండింగ్

దమ్మపేట, సెప్టెంబర్ 29: రుణమాఫీకాని రైతుల అర్హతను ఫ్యామిలీ గ్రూపింగ్ ద్వారా తేల్చుతామని వ్యవసాయ అధికారులు ఇంటింటికీ వెళ్లి సెల్ఫీలు దిగి ఆ ఫొటోను, రైతుల వివరాలను ప్రభుత్వ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఆగస్టు 15 తరువాత మొదలైన ఈ ప్రక్రియ రెండు నెలలు కావస్తున్నా రోజుల తరబడి కొనసాగుతూనే ఉంది. భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలాన్ని పరిశీలిస్తే.. మండలంలో సుమారు 11,300 మంది రైతులు రుణమాఫీకి అర్హులని ప్రభుత్వమే తేల్చింది. వీరిలో అనేక కారణాలు చెబుతూ సుమారు 3,300 మందికి రుణమాఫీకి దూరం చేసింది. రైతుల ఆందోళనల అనంతరం వారిలో 2,800 మంది రైతుల ఫ్యామిలీ గ్రూపింగ్ ప్రక్రియ పూర్తయింది. ఇంకా సుమారు 500 మంది రైతుల ఫ్యామిలీ గ్రూపింగ్‌ను నిర్ధారించి సెల్ఫీలు దిగాల్సి ఉంది. దీంతో 'సెల్ఫీలతోనే సరిపెట్టేస్తారా?' అంటూ అర్హులైన రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 'మా అర్హత తేల్చేదెన్నడు? రుణమాఫీ చేసేదెప్పుడు? అంటూ నిట్టూరుస్తున్నారు.

రైతు ఫ్యామిలీతో సెల్ఫీ తీసుకుంటున్న భద్రాద్రి జిల్లా దమ్మపేట ఏవో చంద్రశేఖర్‌రెడ్డి

• దేవుడా.. ఈ ముఖ్యమంత్రిని మన్నించు

రుణమాఫీ అంశంపై మాట తప్పిన ముఖ్యమంత్రిని మన్నించాలంటూ భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వినూత్న నిరసన తెలిపారు. ఇల్లెందు మండలంలోని ఒడ్డుగూడెంలోని హనుమాన్ ఆలయం వద్ద హనుమంతుడి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. 'రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నెరవేర్చలేదు. అటు రైతులను, ఇటు మిమ్ములను మోసం చేశారు. మీరే దయ చూపి ఆయన్ను క్షమించండి' అంటూ వేడుకున్నారు. - ఇల్లెందు రూరల్

రుణమాఫీ తర్వాతే రైతు భరోసా

› మొదటిపేజీ తరువాయి...

ఈ రెండింటికీ ప్రభుత్వం లంకె పెట్టింది. రుణమాఫీ పూర్తి చేసిన తర్వాతే రైతుభరోసా గురించి ఆలోచిస్తామని స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఇటీవల ఖమ్మం పర్యటనలో 'రుణమాఫీకి రూ.18 వేల కోట్లు ఇచ్చినం. ఇంకా రూ. 13వేల కోట్లు ఇవ్వాల్సి ఉంది. అమౌంట్ సమకూరే వెసులుబాటు ఆధారంగా రైతులకు డేట్ ఇస్తాం. ఆ తర్వాత రైతులు మిగిలిన అమౌంట్ చెల్లించగానే రుణమాఫీ మొత్తం రైతుల ఖాతాలో వేస్తాం. ఇక ఇది(రుణమాఫీ) పూర్తయిన తర్వాత అది(రైతుభరోసా) వస్తది' అంటూ కుండబద్దలు కొట్టారు.

రుణమాఫీ పూర్తయ్యేదెప్పుడు?

రుణమాఫీతో రైతుభరోసాకు లింకు పెట్టడంపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రుణమాఫీ పూర్తయ్యేదెప్పుడు... రైతుభరోసా ఇచ్చేదెప్పుడు అని రైతులు ప్రశ్నిస్తున్నారు. రుణమాఫీ పూర్తి చేసేందుకే ఇంకా రూ. 13 వేల కోట్లు కావాలి. 2 లక్షలకుపైగా రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం ఇంకా కుటుంబ నిర్ధారణ దశలోనే ఉన్నది. దీనికి ప్రత్యేకంగా గైడ్‌లైన్ జారీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ సడీసప్పుడు చేయడం లేదు. ఈ నేపథ్యంలో రూ.2 లక్షల రుణమాఫీ ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రుణమాఫీకి లింకు పెట్టిన రైతుభరోసా కూడా వచ్చే పరిస్థితిలేదనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతున్నది.

వారంలో కోతలు

పంటల సాగు సమయంలో ఇవ్వాల్సిన రైతుభరోసా పెట్టుబడి సాయం.. పంటలు కోతకొస్తున్నా అందకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వారంలో కొన్ని జిల్లాల్లో వరి కోతలు మొదలుకానున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వంలో రైతుభరోసా పంపిణీపై కనీసం చర్చ జరగడంలేదని తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డిగానీ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగానీ రైతుభరోసాపై సమీక్ష కూడా చేయకపోవడం విమర్శలకు బలాన్నిస్తున్నది. పెట్టుబడి కోసం ప్రభుత్వం సాయం చేయకపోవడంతో రైతులు అప్పో సొప్పో చేసి పంటలు సాగు చేసుకున్నారు. మరో పది రోజుల్లో బతుకమ్మ, దసరా పండుగలు ఉన్నాయి. కనీసం ఈ సమయానికైనా ప్రభుత్వం రైతుభరోసా డబ్బులు వేస్తే రైతులు మళ్లీ అప్పు చేయకుండా ఉండే పరిస్థితి ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతుభరోసాకు కనీసం రూ. 11వేల కోట్లు కావాలి. కానీ రుణమాఫీకే అపసోపాలు పడుతున్న ప్రభుత్వం రైతుభరోసా ఇస్తుందనే నమ్మకం లేదని రైతులు చెబుతున్నారు.

సబ్సిడీ గ్యాస్..అంతా తూచ్

ఎనిమిది నెలలు గడుస్తున్నా అర్హులందరికీ అందని రూ. 500కే సిలిండర్ స్కీం

- రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల మంది లబ్ధిదారుల గుర్తింపు
- వర్తిస్తున్నది 44.6లక్షల మందికే
- మరో 20 లక్షల మందికి మొండిచెయ్యే

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తేతెలంగాణ): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన రేవంత్ ప్రభుత్వం ఆచరణలో విఫలమవుతున్నది. ఇందుకు రూ.500కే సబ్సిడీ గ్యాస్ స్కీమే నిదర్శనంగా నిలుస్తున్నది. ఈ పథకం ప్రారంభమై ఎనిమిది నెలలు గడిచినా అర్హులందరికీ అందడంలేదు.

ఆరు గ్యారెంటీల్లో భాగంగా..

ప్రభుత్వం ఫిబ్రవరి 27న రూ. 500కే సిలిండర్ పథకానికి శ్రీకారం చుట్టింది. తెల్ల రేషన్ కార్డులు ఉన్నవారందరికీ వర్తింపజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు. ఎనిమిది నెలలు కావస్తున్నా ఈ హామీ ఆచరణకు నోచుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా 89.9లక్షల మందికి తెల్ల రేషన్‌కార్డుదారులు ఉండగా, 1.20 మందికి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సర్కారు నిబంధనల ప్రకారం 64లక్షల మంది లబ్ధిదారులను ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. అయితే ఈ స్కీం కోసం 58 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 5 లక్షల మంది మొదటి విడతలో అర్జీలు పెట్టలేకపోయారు. మొదట 39.9 లక్షల మందికి ఈ స్కీంను వర్తింపజేశారు. మళ్లీ దరఖాస్తులు స్వీకరించి ఆగస్టులో మరో 4.46లక్షల మంది లబ్ధిదారులను చేర్చారు. అంటే మొత్తంగా సుమారు 44.1లక్షల మందికే వర్తింపజేస్తున్నారు. మిగిలిన 20 లక్షల మంది గ్యాస్ సబ్సిడీ పథకం అందడంలేదు.

ఆర్థిక భారం తప్పించుకొనేందుకే కోత..

గ్యాస్ సబ్సిడీ పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేసేందుకు ఏటా సుమారు రూ. 4వేల కోట్లు ఖర్చుచేయాల్సి వస్తుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. అంటే ప్రతినెలా రూ.333కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. అధికారంలోకి వచ్చేందుకు అడ్డగోలు హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత మొత్తాన్ని వ్యయం చేసే పరిస్థితుల్లో లేదు. అంచనా వేసిన బడ్జెట్‌లో కేవలం సగం మాత్రమే ఖర్చు చేస్తున్నది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక భారాన్ని తప్పించుకొనేందుకే గ్యాస్ సబ్సిడీ స్కీం లబ్ధిదారుల్లో కోతలు విధిస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక లబ్ధిదారులకు సబ్సిడీ నగదు రెండు రోజుల్లోనే జమయ్యేలా చూస్తామని సీఎం ప్రకటించారు. రెండు, మూడు నెలల పాటు ఆయిల్ కంపెనీలకు రాయితీ డబ్బులు ఇస్తామని, తర్వాత నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తామని చెప్పారు. కానీ సిలిండర్ పొందిన వారం, పది రోజులకు గానీ నగదు ఖాతాల్లో పడడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. గ్యాస్ ఏజెన్సీలు, ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూపర్ లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఆర్టీసీలో మూడు వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

- డీజిల్ బస్సులను దశలవారీగా తొలగిస్తాం
- ఉద్యోగుల బకాయిలను దసరాలోగా బాండ్ల రూపంలో చెల్లిస్తాం: పొన్నం

కరీంనగర్ తెలంగాణచౌక్, సెప్టెంబర్ 29: ఆర్టీసీలో త్వరలో మూడు వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో రీజియన్‌కు కేటాయించిన 35 సూపర్ లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సులను సంస్థ వైస్ చైర్మన్, ఎండీ సజ్జనార్, మానకొండూర్, చొప్పదండి, జగిత్యాల ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి సభలో మంత్రి మాట్లాడారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నదని తెలిపారు. అందులో భాగంగా డీజిల్ భారాన్ని తగ్గించుకోవడంతో పాటు కాలుష్యనివారణకు 2,500 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయగా, వెయ్యి బస్సులు అందుబాటులోకి వచ్చినట్టు తెలిపారు. ఉద్యోగుల బకాయిలను దసరాలోగా బాండ్ల రూపంలో చెల్లిస్తామని పేర్కొన్నారు.

అమృత్‌పాల్ సింగ్ తండ్రి కొత్త రాజకీయ పార్టీ

అమృత్‌సర్: ఖలిస్థాన్ అనుకూల వాది అమృత్‌పాల్ సింగ్ తండ్రి తార్సెమ్ సింగ్ పంజాబ్‌లో ఓ రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నారు. ఆయన ఆదివారం స్వర్ణ దేవాలయంలో ప్రార్థనల అనంతరం ఈ విషయాన్ని వెల్లడించారు. అమృత్‌పాల్ పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. ఆయనపై జాతీయ భద్రత చట్టం ప్రకారం కేసు నమోదైంది. ఆయన ప్రస్తుతం అస్సాంలోని దిబ్రుగఢ్ జైలులో ఉన్నారు. పంజాబ్‌లో నాలుగు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు త్వరలో జరుగుతాయి. ఈ తరుణంలో తార్సెమ్ ఈ ప్రకటన చేశారు.

అటకెక్కిన వన మహోత్సవం

- హరితహారం పేరు మార్చిన ప్రభుత్వం
- 20.02 కోట్ల మొక్కలు నాటుతామని ప్రతిజ్ఞ
- ఆ తర్వాత 13 కోట్లకు లక్ష్యం కుదింపు
- అయినా ఇప్పటి వరకు నాటింది 5 కోట్లే
- అనుకూల వాతావరణం ఉన్నా అనాసక్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): హరితహారం కార్యక్రమం పేరు మార్చి దానికి వన మహోత్సవం అని పేరు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు దానిని అటకెక్కించింది. పర్యావరణం, నదులు, ప్రకృతికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని గొప్పలు చెప్పున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. వన మహోత్సవంలో ఈ ఏడాది 20.02 కోట్ల మొక్కలు నాటుతామని ప్రకటించి ఆ తర్వాత లక్ష్యాన్ని 13 కోట్లకు కుదించింది. ఈ ఏడాది ఆశించిన దానికంటే అధిక వర్షాలు కురిసి మొక్కలు నాటేందుకు అనుకూలమైన వాతావరణం ఉన్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. బీఆర్‌ఎస్ పాలనలో 9 విడతలు నిర్వహించిన హరితహారంలో దాదాపు 283 కోట్ల మొక్కలు నాటారు. పచ్చదనం-పరిశుభ్రతలో తెలంగాణ దేశానికి రోల్ మాడల్‌గా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం జూన్ 9న హరితహారం పేరును 'వన మహోత్సవం'గా మార్చింది. మొదటి విడత జూలై 8న వన మహోత్సవాన్ని అధికారికంగా ప్రారంభించింది. అప్పటి నుంచి ఆదివారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 5 కోట్ల మొక్కలు కూడా నాటలేకపోయింది.

నిధులు కేటాయించకపోవడం వల్లే

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమానికి ప్రతి ఏటా ప్రత్యేకంగా నిధులు కేటాయించేది. నర్సరీలలో మొక్కలు పెంచడానికి, గుంతలు తవ్వడానికి, మొక్కలను గ్రామాల్లోకి సరఫరా చేయడానికి అవసరమయ్యే నిధులను కార్యక్రమానికి ముందు రోజే విడుదల చేసేది. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమానికి అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసేవారు. కానీ ఈ ఏడాది వన మహోత్సవానికి అలాంటి ముందస్తు ప్రణాళిక, ఏర్పాట్లు లేకపోవడం, నిధులు కేటాయించకపోవడంతో క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా మొక్కలు నాటేందుకు ఆసక్తి చూపలేదు. కార్యక్రమ అమలు కోసం నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి అటవీశాఖ ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు.

తగ్గిన ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యం

ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక ఏర్పాటు చేయకపోవడం, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల వన మహోత్సవం విఫలమైనట్టు అటవీశాఖ అధికారులు అంతర్గత చర్చల్లో అభిప్రాయపడుతున్నారు. గతంలో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అటవీశాఖతో నిత్యం కార్యక్రమ అమలుపై పర్యవేక్షణ ఉండేదని, ఈ ఏడాది అలాంటి పర్యవేక్షణ లోపించడంతోనే వన మహోత్సవం ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదని అటవీశాఖ భావిస్తున్నది. దీనికితోడు క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి ప్రజాప్రతినిధులు ఆసక్తి చూపలేదని తెలిసింది.

అనాథల్లా అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు!

- కడుపునిండా తిండికి నోచని బాలురు
- అరకొర వసతులు.. అధ్వాన పరిస్థితులు
- నాలుగు జిల్లాల్లో ప్రారంభమే కాని పాఠశాలలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): అనాథలు, నిరాశ్రిత, విధివంచిత బాలురకు ఆశ్రయాన్నిస్తున్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు (యూఆర్‌ఎస్) అనాథల్లా మారాయి. వీటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఫలితంగా పాఠశాలల్లోని బాలురు కడుపునిండా తిండికి నోచడం లేదు. అక్కడి అరకొర వసతులు, అధ్వాన పరిస్థితులు కలవరపెడుతున్నాయి. బడిబయటి బాలురను బడిబాట పట్టించి వారి బంగారు భవితకు బాటలు వేయడానికి 2017లో జిల్లా కేంద్రాల్లో అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. విధి వంచితులు, అనాథలు, బాల వలస కార్మికులు, నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన బాలుర కోసం వీటిని నెలకొల్పారు. బాలికలకు కేజీబీవీల లాంటివే బాలుర కోసం, పూర్తి రెసిడెన్షియల్ స్థాయిలో యుఆర్‌ఎస్‌లను ప్రారంభించారు. రాష్ట్రంలో 29 యూఆర్‌ఎస్‌లు ఉండగా, వీటిల్లో 2,500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరి కోసం 173 మంది సీఆర్టీలను నియమించారు. 84 కేజీబీవీల్లో ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. కానీ, యూఆర్‌ఎస్‌లను 8వ తరగతి వరకే నిర్వహిస్తున్నారు. ఒక్క యూఆర్‌ఎస్‌కు కూడా అప్‌గ్రేడ్ చేయలేదు. ములుగు, నారాయణపేట, మహబూబాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కొత్త యూఆర్‌ఎస్‌లను ప్రారంభించాల్సి ఉండగా, ఇంతవరకు ఆరంభానికి నోచుకోలేదు.

రోజూ రూ.35 చొప్పున మెస్‌చార్జీ

అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలోని ప్రతి విద్యార్థికి కేవలం నెలకు రూ.1,049.50, అంటే రోజూ రూ.35 చొప్పున చెల్లిస్తున్నారు. ఈ మెస్‌చార్జీలతో నాణ్యమైన భోజనం పిల్లలకు అందించలేకపోతున్నారు. 2022-23 విద్యా సంవత్సరం వరకు కేజీబీవీ విద్యార్థినులతో సమానంగా మెస్‌చార్జీలను చెల్లించేవారు. రానురాను కేజీబీవీ విద్యార్థినులకు రూ.1,225 ఇస్తుండగా అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థులకు మాత్రం కేవలం రూ.1049.50తోనే సరిపెడుతున్నారు. రోజు వారీ మెనూను రూపొందించనేలేదు. ఏరోజు ఏమి పెట్టాలో, ఎన్ని గ్రాములు ఇవ్వాలో సూచించనేలేదంటే ఈ స్కూళ్ల పట్ల అధికారులెంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

సొంత భవనాలు అసలే లేవు!

యూఆర్‌ఎస్‌లు ఏర్పాటై ఏడేండ్లు గడుస్తున్నా స్థల సేకరణ, సొంత భవనాలు లేకపోవడం గమనార్హం. ఖమ్మం మినహా మిగతా పాఠశాలలు అద్దె భవనాల్లో, పాతబడిన ప్రభుత్వ భవనాల్లో, అరకొర వసతుల మధ్యే కొనసాగుతున్నాయి. 13 సర్కారు బడుల ప్రాంగణాల్లో, 11 అద్దె భవనాల్లో, 5 ఇతర భవనాల్లో కొనసాగుతున్నాయి. ఏ ఒక్క పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, డార్మెటరీలు, వంటగది, భోజనశాలలు లేవు. విద్యార్థులకు ట్రంక్ పెట్టెలు, బెడ్ షీట్లు, దుప్పట్లు, ఇవ్వడమే లేదు. మంచినీటి కోసం ఆర్వో ప్లాంట్లు గానీ, చలికాలంలో విద్యార్థులకు వేడినీటి కోసం హీటర్లు గానీ ఇవ్వడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు సమీక్షించి, తగు వసతులు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఇక నిమిషాల్లో సాయిల్ టెస్ట్ ఫలితాలు

- ఐఐటీ ఖరగ్‌పూర్‌తో కలిసి నూతన విధానాన్ని డెవలప్ చేసిన ఇక్రిశాట్
- 80 శాతం ఆక్యురసీతో మట్టి నాణ్యత వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ) : వ్యవసాయ రంగానికి అధునాతన సాంకేతికతను అందిస్తున్న ఇక్రిశాట్.. ఐఐటీ ఖరగ్‌పూర్‌తో కలిసి మరో వినూత్న టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. సాగు దిగుబడి, పంటల రోగ నిరోధకతను పెంచడంలో కీలకమైన మట్టిలోని పోషకాలను సమర్థవంతంగా గుర్తించే సులభమైన విధానాన్ని డెవలప్ చేసింది. అధునాతన టెక్నాలజీతో పనిచేస్తూ 80 శాతం కచ్చితమైన ఫలితాలను వెల్లడించే సాయిల్ టెస్ట్ మేనేజ్‌మెంట్ పేరిట ప్రత్యేక సాంకేతికతను డిజైన్ చేశారు. డిఫ్యూజ్ రిఫ్లెక్టెన్స్ స్పెక్ట్రోస్కోపీ(డీఆర్‌ఎస్)విధానంలో పనిచేస్తూ నిమిషాల్లోనే మట్టి నాణ్యత ఫలితాలను పొందవచ్చని, భూసారాన్ని బట్టి పంట రకాలను ఎంపిక చేసుకోవచ్చని చెప్తున్నారు.

అధునాతన టెక్నాలజీతో భూసార పరీక్షలు..

అధునాతన టెక్నాలజీతో సాయిల్ టెస్టింగ్ చేసేందుకు వీలుగా ప్రత్యేక ల్యాబొరేటరీని ఇక్రిశాట్‌లో ఏర్పాటుచేశారు. ఏకకాలంలో 250కి పైగా శాంపిళ్లను పరీక్షించేందుకు వీలుగా దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా ప్రాథమిక మట్టి నాణ్యత, మట్టిలోని స్థూల, సూక్ష్మ పోషకాలను అంచనా వేసేందుకు 14 రకాల పరీక్షలను నిర్వహించవచ్చు. ప్లాస్మా ఆప్టికల్ విధానం ద్వారా మట్టి నాణ్యతను తెలుసుకునే వీలుంది. ఇప్పటివరకు ఈ ల్యాబొరేటరీ ద్వారా 2,86,449 మట్టి శాంపిళ్లను విశ్లేషణ చేయగా, 4.5 లక్షల పంటలను అధ్యయనం చేశారు. ప్రస్తుతం తెలంగాణతోపాటు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి మట్టి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తూ ఆయా ప్రాంతాల వాతావరణ, నీటి లభ్యత ఆధారంగా నేలకు అవసరమైన పోషకాలను సూచిస్తున్నారు.

మాట్లాడుతున్న విజయకుమార్‌రెడ్డి

తీన్మార్ మల్లన్నపై టీపీసీసీకి ఫిర్యాదు చేస్తాం

కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి

కల్వకుర్తి, సెప్టెంబర్ 29 : సీఎం రేవంత్‌రెడ్డిని నోటికొచ్చినట్టు దూషిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీపీసీసీకి ఫిర్యాదు చేయనున్నట్టు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కల్వకుర్తిలో మీడియాతో మాట్లాడారు. ఇతర పార్టీల్లో ఇబ్బందులకు గురై, కేసుల పాలైన మల్లన్నను కాంగ్రెస్ పార్టీ అక్కున చేర్చుకొని ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఒక పార్టీలో ఉన్నప్పుడు ఎలా నడుచుకోవాలో తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌తోపాటు ఎమ్మెల్యే నారాయణరెడ్డిని చులకన చేసి మాట్లాడటం సరికాదని సూచించారు. తీన్మార్ మల్లన్నపై టీపీసీసీకి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు.